క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలో జరుగుతున్న తిమ్మగురుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ఆటల పోటీలు ఘనంగా ముగిశాయి. సోమవారం రాత్రి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల ఆట, పాట అందరినీ అలరించాయి. ఆటల పోటీల విజేతలకు ఎస్ఐ నరేంద్ర చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కౌన్సిలర్లు దస్తగిరి, బజారి, విజయుడు, యూత్ సభ్యులు మనోహర్, ఆచారి, ఉగ్ర,రామయ్య, పి.నాగరాజు, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రానీయొద్దు

పాణ్యం: గ్రామాల్లో నీటి సమస్య రానీయొద్దని ఎంపీడీఓ దస్తగిరి ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో గ్రామాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని, ఎవరూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. జగనన్న లేవుట్లలో లబ్ధిదారులందరూ ఇళ్లు కట్టుకునేలా చైతన్యం కలిగించాలని సూచించారు. పనుల్లో పురోగతి లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎండల తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించేలా కృషి చేయాన్నారు. ఈఓఆర్డీ భాస్కరరావు, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు మంగళవారం సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. గ్రామంలోని బీసీ కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో మురికినీరు రోడ్డుపైనే నిల్వ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి రూ.3 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు డ్రైనేజీ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమణమూర్తి ఉప సర్పంచ్ గోదా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 19వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌తో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకానున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, పొదుపు లక్ష్మీ గ్రూపులు, స్త్రీ, శిశు సంక్షేమం, పశు పోషణ, వ్యవసాయం, విద్య - వైద్యం, కుటుంబ నియంత్రణ, గ్రామ పంచాయతీ - అభివృద్ధి పనులు, మైనర్ ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ రోడ్లు, భవనాలు, గ్రామాల్లో తాగునీటి సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు అజెండాలో పేర్కొన్నారు.

పనులు వేగవంతం చేయండి



హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మనబడి నాడు-నేడు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో గదులకు మరమ్మతులు, మరుగుదొడ్ల ఏర్పాటు, మంచినీరు సౌకర్యం తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమ్మెటివ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎఫ్ఏ-4కు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీఆర్పీలు శ్రీహరి, రాజశేఖర్, ఏపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

జాతర సందడి

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడి జాతరలో సందడే సందడి నెలకొంది. వ్యాపారులు, కొనుగోలుదారులతో కిక్కిరిసింది. వ్యవసాయ పనిముట్లు, ఎద్దుల బండ్లు, చక్రాలు, ఇనుప సామగ్రి కొనుగోలు దారులతో కిటకిటలాడుతుంది. అలాగే చిన్న పిల్లలు రంగుల రాట్నం, వినోదం కోసం ఏర్పాటు చేసిన పరికరాలపై తిరుగుతూ ఉత్సాహంగా కనిపిస్తున్నారు. మిఠాయిలు, చెరుకు గడలు కొనుగోళ్లతో సందడి వాతావరణం ఏర్పడింది. మహిళలు తమ ఆడ పడుచులకు గాజులు అందిస్తూ ఆనందంగా గడుపుతున్నారు. కడ్డీ మాంసం అదరహో అనిపిస్తుంది. గూడూరు జాతర అంటేనే కడ్డీ మాంసం స్పెషల్. ఇక్కడి వాపారస్తులు ఒక రకమైన చెట్టు వేర్ల నుంచి రసం తీసి మసాల సిద్ధం చేసుకుని, మాంసానికి దట్టించి నిప్పుల మీద కాల్చుతారు. జాతరకు వచ్చే వారు కడ్డీ మాంసం రుచి చూడకుండా వెళ్లరనే అభిప్రాయం ఉంది.

కాలేయానికి ముప్పు

- పెరుగుతున్న ఫ్యాటీ లివర్, హెపటైటిస్ రోగుల సంఖ్య
- ఆల్కహాల్ సేవనంతో లివర్ సిరోసిస్
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా అత్యాధునిక పరీక్షలు, మందులు
- హెపటైటిస్‌కు రూ.10 వేలు విలువ చేసే మందులు ఉచితం
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం

కర్నూలు(హాస్పిటల్): మన శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి. జీర్ణప్రక్రియలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆహారం సరిగా జీర్ణమయ్యేందుకు, పోషకాలు శరీరానికి అందించేందుకు, వ్యర్థాలు బయటకు పోయేందుకు కాలేయ పనితీరు చాలా ముఖ్యం. అయితే చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వారసత్వం తదితర కారణాల వల్ల కాలేయం చిక్కుల్లో పడుతోంది. కొన్నిసార్లు కాలేయ మార్పిడికి దారి తీస్తుంది. ఏటా ఏప్రిల్ 19న ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీర్ణకోశ వ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజీ)కు 2022లో 722, ఈ యేడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో 126 మంది కాలేయ సమస్యలతో చికిత్స కోసం వచ్చారు. వీరిలో అక్యూట్ హెపటైటిస్ 48, ఆల్కహాల్ కేసులు 539, హెచ్‌బీవీ 121, హెచ్‌సీవీ 36, న్యాష్ 5, ఏఐహెచ్ 4, హెచ్‌సీసీ 19, ఇతర సమస్యలతో 179 మంది చికిత్స కోసం వచ్చారు. అధిక శాతం మంది ఆల్కహాలు సేవించడం, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, హెపటైటిస్-బి, సి వైరస్ వంటి ఇన్‌ఫెక్షన్ల కారణంగా లివర్ దెబ్బతినడం వల్ల వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్ని రకాల జీర్ణకోశవ్యాధులు, కాలేయ వ్యాధులకు ఉచితంగా అత్యాధునిక వైద్యపరీక్షలు, మందులు అందజేస్తున్నారు. ముఖ్యంగా హెపటైటిస్-బి, సి వ్యాధులకు ఖరీదైన మందులను ఉచితంగా అందిస్తున్నారు.

అవయవాల్లో కెల్లా కాలేయం భిన్నం

మానవ శరీరంలోని అతి పెద్ద గ్రంథి కాలేయం. ఇది జీవక్రియ, రోగనిరోధక శక్తి, జీర్ణక్రియ ప్రక్రియల్లో చురుగ్గా వ్యవహరిస్తుంది. కాలేయం పూర్తిగా దెబ్బతినే వరకు ఎలాంటి సంకేతాలు కనిపించవు. అలాగని అశ్రద్ధ చేస్తే కచ్చితంగా ముప్పు తెచ్చుకున్నట్లే.

కాలేయ వ్యాధి లక్షణాలు

కాళ్ల,చీలమండలాల్లో వాపు,ఆకలిలేకపోవడం,వికారం,వాంతులు, జ్వరం,కామెర్లు,కడుపునొప్పి, మూత్రం రంగులో మార్పు,పొట్టుచుట్టూ దురద,ఎరుపు చర్మం,మలంలో రక్తం తదితర లక్షణాలు కనిపిస్తే వైద్యులను కలిసి చికిత్సతీసుకోవాలి.రెండు అంతకంటే ఎక్కువ లక్షణాలు ఉంటే తక్షణ వైద్యసహాయం అవసరం.



కాలేయ వ్యాధులు రాకుండా ఉండాలంటే...!

- అతిగా మద్యం, మాంసం, కొవ్వు పదార్థాలు, వేపుళ్లు తీసుకోరాదు
- ఉప్పు, చక్కెర ఎక్కువ మోతాదులో తీసుకోవడం ప్రమాదకరం
- ప్రాసెస్ చేసిన పిండి, ధాన్యాలు తినవద్దు.

ఇలా చేయాలి...

- పచ్చని ఆకుకూరలు లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి.
- సల్ఫర్ ఎక్కువగా ఉండే వెల్లుల్లి, పసుపు కాలేయానికి మేలు చేస్తాయి.
- గ్రీన్‌టీ, ఆపిల్ పండ్లు, ఆలివ్ ఆయిల్, వాల్‌నట్స్, అవకాడోలు కాలేయాన్ని శుభ్రం చేస్తాయి.
- విటమిన్-సి పదార్థాలు కాలేయం వద్ద కొవ్వును నియంత్రిస్తాయి.
- నీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కాలేయాన్ని దెబ్బతీసే ఫ్యాటీలివర్



కాలేయం చుట్టూ కొవ్వు చేరడం వల్ల ఫ్యాటీలివర్ వస్తుంది. అధికంగా ఆల్కహాలు తీసుకోవడం, ఆహారపు అలవాట్ల కారణంగా వచ్చిన ఫ్యాటీలివర్‌ను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే కాలేయం మరింత దెబ్బతినే అవకాశం ఉంటుంది. మద్యం తాగకపోయినా ఫ్యాటీలివర్ సమస్యలు వస్తుంటే నాన్ ఆల్కహాల్ ఫ్యాటీలివర్ డిసీజ్ అంటారు. హెపటైటిస్-బి, సి మందులతో నయం చేసుకోవచ్చు.

–డాక్టర్ వెంకటరంగారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

మద్యం మానేస్తే కాలేయానికి మేలు



ఆల్కహాలు శరీరాన్ని విపరీతంగా డీహైడ్రేట్ చేస్తుంది. కాలేయం శరీరం నుంచి ఈ విషాన్ని తొలగించేందుకు కష్టపడుతుంది. ఆల్కహాలుకు బానిసైన వారు భవిష్యత్‌లో సిర్రోసిస్ సమస్యకు గురవుతారు. అలాగే హెపటైటిస్-బి, సి వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్స్ కూడా ఈ కాలేయ సమస్యకు కారణం. 10 నుంచి 15 సంవత్సరాలకు పైగా ఈ ఇన్‌ఫెక్షన్స్‌తో సతమతమయ్యే వారిలో సిర్రోసిస్ సమస్య కనిపించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, మంచి జీవనశైలి, సరైన నిద్ర, మద్యపానం, ధూమపానికి దూరంగా ఉండటం ద్వారా కాలేయాన్ని కాపాడుకోవచ్చు.

–డాక్టర్ పి.అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ

గూడూరు: కర్నూలు ఆర్డీఓ సి.హరిప్రసాద్ మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. మునుగాల రహదారిలో నగర పంచాయతీ వారు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఏర్పాటు చేయనున్న మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు అవసరమైన స్థలం పరిశీలనకు వచ్చినట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ ప్రాంతంలో స్థలం అనుకూలంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామాంజనేయులు, మున్సిపల్ ఏఈ నరసింహులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. ఆయన మంగళవారం పోలకల్ గ్రామ సచివాలయంలో ప్రజలకు అందుతున్న ఆధార్ సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలోని సి.బెళగల్-1, పోలకల్-3 గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నారని, ప్రజలు బయోమెట్రిక్ అప్‌డేషన్, ఇతర ఆధార్ మార్పులకు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు.

బస్టాండులో సౌకర్యాలు కల్పించండి

పాణ్యం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎంపీపీ ఉసేన్‌బీ నంద్యాల డీఎంను కోరారు. ఆమె మాట్లాడుతూ బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే బస్టాండ్‌లో విద్యార్థి బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసి నెలనెలా అద్దెలు వసూలు చేస్తున్నారుగానీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనతో పాటు శుభ్రత పాటించేలా చూడాలని కోరారు.

ఇళ్లవద్దకే సంక్షేమ పథకాలు



కె.సింగవరంలో వృద్ధురాలి సమస్యను వింటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ పాలనలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని కె.సింగవరంలో సర్పంచ్ రవీంద్రరెడ్డి అధ్యక్షతన అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ.. మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని సంక్షేమ క్యాలెండర్లతో వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వాటిని వీలైంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరిందని వివరించారు. గ్రామస్తులు సీసీ రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ స్తంభాలు, రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని మండల అధికారులను ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యుడు నడిపి సోమన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖరెడ్డి, రామచంద్రారెడ్డి, మహానంది, సూర్యచంద్ర, ఆనందం, కార్యాకర్తలు, ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఈఓఆర్డీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈర్లదిన్నెలో...

కొత్తకోట గామ సచివాలయం పరిధిలోని ఈర్లదిన్నెలో బుధవారం నుంచి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఈఓఆర్డీ సందీప్ పేర్కొన్నారు. ఉదయం 7:30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని మండల స్థాయి అధికారులు, అందుబాటులో ఉండాలని సూచించారు.

నేడు ప్యాలకుర్తికి ఎమ్మెల్యే రాక

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి బుధవారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విచ్చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్ మంగళవారం తెలిపారు. గ్రామంలో నిర్వహించే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పాల్గొంటారని, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



కె.మార్కపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కె.మార్కపురం గ్రామంలో సర్పంచ్ గణ మద్దిలేటి, నాయకులు దొరబాబు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బోయ శారద, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి గడపను సందర్శిస్తూ మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, వర్గాలకు, మతాలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. పలువురు స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

- ఎస్సీ కాలనీలో సాముహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు.
- గ్రామంలో శ్మశాన వాటిక నుంచి మెయిన్ రోడ్డు వెంట డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలన్నారు.
- రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.
- గ్రామానికి చెందిన గిడ్డమ్మ, లక్ష్మీదేవి, మాధవి పింఛన్ రావడం లేదని చెప్పగా అర్హతలు పరిశీలించి పింఛన్లు మంజూరు చేయాలని, కాలనీవాసులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమస్యలను తల్లిదండ్రులు తెలియజేయగా అవసరమైన వారికి ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు.

తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర, కృష్ణ, రామతిమ్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవిని మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



దివ్యాంగులకు వాహనాలను అందజేస్తున్న కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు(సెంట్రల్): దివ్యాంగుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్ పేర్కొన్నారు. రూ.1.25 లక్షల విలువ చేసే త్రిచక్ర మోటార్ వాహనాలను ఉచితంగా అందించి వారి ఎదుగుదలకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో కోడుమూరు నియోజకవర్గానికి చెందిన 10 మంది దివ్యాంగులకు త్రిచక్ర మోటార్ వాహనాలను ఆయన కలెక్టర్‌తో కలసి అందజేశారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. మోటారు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. వికలాంగుల శాఖ ఏడీ విజయ పాల్గొన్నారు.

జగనన్నకే జనం మద్దతు

కోడుమూరు రూరల్: కులమత తారతమ్యం లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రజల దరిచేర్చి జనం మెచ్చిన నేతగా జగనన్న ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం గోరంట్ల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుధాకర్, గ్రామ సర్పంచు బాలక్రిష్ణ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు పాలనతో పోల్చుకుంటే జగనన్న పాలనలో మీ కుటుంబానికి మంచి జరిగిందా? సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని ఆరా తీస్తూ వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే నుంచి జగనన్న స్టిక్కర్లను ఇప్పించుకుని స్వయంగా ఇంటి గోడలకు అతికించుకున్నారు.

చంద్రబాబుకు బుద్ధి మందగిస్తోంది

అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జనంలో జగనన్నకు ఉన్న ఆదరణను చూసి చంద్రబాబుకు ఏమి మాట్లాడాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వయస్సు మీద పడడంతో బాబుకు బుద్ధి మందగించిందని విమర్శించారు. దళితులను అవమానించేలా మాట్లాడిన నారా లోకేష్ క్షమాపణ చెప్పాలని, లేకపోతే కోడుమూరు నియోజకవర్గంలో ఆయన పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. స్థానిక నాయకులు మధుమోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గిడ్డయ్య, బాలు, మనోహర్ పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం

ఓర్వకల్లు: రాష్ట్రంలో పేదల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమవుతుందని ఎంపీపీ తిప్పన్న అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు, కాల్వబుగ్గ, పాలకొలను, ఉప్పలపాడు, శకునాల తదితర గ్రామాలలో సాయంత్రం స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్లను అతికించారు. అలాగే ఆయా గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ప్రజల వద్దకు వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



తిమ్మగురుడి స్వామి పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలో జరుగుతున్న తిమ్మగురుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారికి పారు వేట ఉత్సవం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అశ్వ వాహనంపై ఉంచి ఊరేగింపు చేపట్టారు. ఆలయ సిబ్బంది మురళి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు: క్రేన్ ప్రమాదంలో మృతి చెందిన అన్సారీ కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గుమ్మితం తండా వద్ద సోలార్ ప్రాజెక్టు పనుల్లో పశ్చిమబెంగాల్‌కు చెందిన సాధిక్ అలాం అన్సారీ మృత్యువాత పడడం బాధాకరమన్నారు. కార్మికులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పరిహారం చెల్లించి బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు

'ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్'పై శిక్షణ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్న విద్యార్థులకు 'ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్'పై రెండు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ముంబై ఇస్కాన్ టెంపుల్ నుంచి హరిప్రభు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆలోచనలు మార్చుకుని విజయాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ , సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి సమస్య

కోడుమూరు రూరల్: దశాబ్దాలుగా కలగా మారిన కోడుమూరు వాసుల మంచినీటి సమస్య త్వరలో తీరనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా కోడుమూరుకు శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీటినందించేందుకు ఆర్థిక శాఖ అనుమతినిస్తూ రూ.30.30 కోట్లకు టెండర్లు పిలిచింది. ఈ మేరకు మంగళవారం టెండర్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. కోడుమూరు నీటి సమస్య పరిష్కారానికై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు

గడివేముల: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో ప్రాథమిక సౌకర్యాలు కల్పించినట్లు ఏపీఓ వెంకట రమణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్‌కే తాండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ వేసవికాలం కావడంతో కూలీలకు సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో 272 మంది కూలీలకు పనులకు వస్తున్నట్లు చెప్పారు. పనులు చేసే ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచడంతో పాటూ కూలీలకు నీడ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



సూచనలిస్తున్న ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి

పాణ్యం: ప్రజలు ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని పాణ్యం ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం పాణ్యంలోని గడ్డంపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. రోజురోజుకు ముదురుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు నీటిని అధికంగా తీసుకోవాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ ధరించాలన్నారు. అలాగే పుచ్చకాయ, దోసకాయ, పండ్లరసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తీసుకోవాలని సూచించారు. టీ, కాఫీ, మసాలా పదార్థాలను తగ్గించాలన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఏఎన్ఎం పద్మావతి, ప్రసాద్, రాజేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



ఎర్రదొడ్డి గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

కోడుమూరు: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. మంగళవారం ఎర్రదొడ్డి గ్రామంలో పీడీ పర్యటించి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేయడంతో పాటు, జగనన్న కాలనీని సందర్శించారు. పీడీ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఇళ్లు కట్టుకునే వారందరికీ ప్రభుత్వం ఇసుక, ఐరన్, సిమెంట్ వంటి వాటిని ఉచితంగా అందజేయడంతో పాటు, బిల్లులను సకాలంలో మంజూరు చేస్తోందన్నారు. అనంతరం పీడీ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి కార్యాలయ రికార్డులు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. సచివాలయం శుభ్రంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనివేళల్లో సిబ్బంది కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పీడీ వెంట గ్రామ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు ఉన్నారు.

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కోడుమూరు రూరల్: చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని కోడుమూరు అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిమాపక సిబ్బంది పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అగ్నిమాపక పరికరాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా వాహనదారులు అగ్నిప్రమాదాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ వంటి మండే స్వభావం ఉన్న వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుకోని ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.